# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 14, ఫిబ్రవరి, 2015

లక్షల మందిలో కొందరికి మాత్రమే ప్రజా ప్రతినిధిగా పనిచేసే అరుదైన అవకాశం వస్తుందని, దీన్ని సద్వినియోగపరుచుకుని సేవలు అందించి ప్రజల మనసుల్లో నిలవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. టూరిజం ప్లాజాలో శనివారం జరిగిన మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, మున్సిపల్ కమీషనర్లు, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. మంత్రులు హరీష్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జోగురామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పార్లమెంటరీ కార్యదర్శులు వినయభాస్కర్, జలగం వెంగల్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఎంజీ. గోపాల్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమీషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం, సౌకర్యాల కల్పన కోసం కృషి చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలోని నగరాలు, పట్టణాలలో పరిస్థితి ఏమి బాగాలేదని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితి నుండి అన్ని నగరాలు, పట్టణాలు అద్భుతంగా తయారయ్యేందుకు అవసరమైన ప్రణాళికలు వేసుకొని ముందుకు పోవాలన్నారు. ముఖ్యంగా చాలా నగరాలు పట్టణాల్లో ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదని, వచ్చే కొద్దిపాటి నల్లా నీరు కూడా ప్రతిరోజు రావడం లేదన్నారు. ఈ పరిస్థితిని రూపుమాపేందుకే తెలంగాణ వ్యాప్తంగా మంచినీటి పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు ప్రతి మనిషికి 135 లీటర్ల చొప్పున మంచినీళ్లు అందివ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ద్వారా పట్టణాలకు మంచినీళ్లను సరఫరా చేస్తామని, ఆ నీళ్లను ప్రతి ఇంటికి పంపించే బాధ్యతను కార్పోరేషన్లు, మున్సిపాలటిలు స్వీకరించాలన్నారు. పట్టణం సమీపంలోని గుట్టలపై కాని, ఎత్తైన ప్రదేశంపై కాని సంపు

నిర్మించుకోవాలని సూచించారు. అక్కడి నుండి గ్రావిటీ ద్వారా అన్ని ఇండ్లకు నీళ్లు పంపించాలన్నారు. కేవలం ఇండ్లకే కాకుండా బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కూడా మంచినీళ్లివ్వాలని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాన్ని తెలంగాణలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణాలను పరిశుభ్రంగా మార్చడానికి, అవసరమైనన్ని టాయిలెట్లు నిర్మించడానికి స్వచ్ఛ్‌భారత్ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణలో స్వచ్ఛ తెలంగాణ – స్వచ్ఛ్ భారత్ నినాదంతో ఈ కార్యక్రమం అమలు చేసుకుందామన్నారు. ఆయా పట్టణాల్లో ఎన్ని కూరగాయల మార్కెట్లు, మాంసాహార మార్కెట్లు, పార్కులు, స్మశాన వాటికలు, బరేల్ గ్రౌండ్స్, డంపింగ్ యార్డ్స్ ఉన్నాయో చూసుకుని ఇంకా ఎన్ని కావాలో ప్రతిపాదనలు సిద్దం చేయాలన్నారు. వీటి నిర్మాణానికి వనరుల సమీకరణ కోసం కూడా మార్గాలు అన్వేషించాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల నిధుల నుండి కూడా కొంత మొత్తాన్ని మున్సిపాలిటీలకు కేటాయిస్తామన్నారు. తాను ఇటీవల వరంగల్, మహబూబ్‌నగర్‌లలో పర్యటించానని, అక్కడ పేదలు దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్నారన్నారు. అలాంటి వారి కోసం దశల వారిగా 560 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇండ్లు కట్టిస్తామని చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం